## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కరెంట్‌కు మొండిచెయ్యి

- మూడు గంటల కరెంట్ చాలంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- మండిపడుతున్న కర్షకలోకం
- 10 హెచ్‌పీ మోటర్లతో నిత్యం గండమే..
- కౌలుదారు కాలం పెడితే హక్కులు కోల్పోతామంటూ భయపడుతున్న రైతన్నలు

## సొట్టగ మాట్లాడుతున్న రేవంత్..

నేను 2006 నుంచి లేత్ మిషన్ షాప్‌లో పనిచేసిన. నేను సొంతంగా షాప్ పెట్టి పద్నాలు గేండ్లు అయితుంది. పనినేర్చుకునేటప్పుడు కానీ.. షాప్ పెట్టిన తర్వాత కూడా ఇప్పటివరకు ఒక్క రైతు కూడా 10హెచ్‌పీ మోటర్ నాతో నికి రిపేరుకు తేవడం చూడలేదు. రేవంత్‌రెడ్డి ఒక్కడే 10హెచ్‌పీ మోటర్ వాడ్తడేమో. ఎంతకైనా 7.50 హెచ్‌పీ మోటర్లే వ్యవసాయానికి సరిపోతవి. అన్నంత ఈజీ కాదు 10హెచ్‌పీ అంటే.. ఒకసారి రేవంత్‌రెడ్డిని 10హెచ్ పీ మోటర్‌ను ఎత్తి కొంచెం పక్కకు జరుపమను తెలుస్తది. నోరు జారి తప్పు మాట్లాడిన అని రైతులకి క్షమాపణ చెప్పలేక సొట్టగ మాట్లాడుతుండు అంతే. నేను కూడా రైతునే, నాకు పొలం ఉంది. కాంగ్రెస్ మాటలు వింటే ఉన్నది పాయే.. ఉంచు కున్నది పాయే.. అనే కథలు తప్పా ఒరిగేదేమీ లేదు. కరెంట్ ఉంటేనే మోటర్ రిపేర్ చేసి రైతుకు ఇస్తం. మూడు గంటల కరెంటిచ్చేటోళ్లకంటే 24 గంటల కరెంటిచ్చే కేసీఆర్ ఉంటే సాలు.

**- బాబు, మోటర్ రిపేర్, ఇంజినీరింగ్ వర్క్‌షాప్ యజమాని, ధరూరు**

## మళ్లీ పాతరోజులొస్తయ్..



తెలంగాణ ప్రభుత్వం 24గంటల కరెంటు ఇస్తూ మాకు చాలా మేలు చేస్తుంది. ఇది చాలా గొప్ప కార్యక్రమం. నిరంతర కరెంటు ఇవ్వడం వల్ల మేమంతా పగటిపూటనే పొలాల్లో నీరు పారించి, రాత్రి ప్రశాంతంగా ఇండ్లకాడ నిద్రిస్తున్నాం. గతంలో కరెంటు సరిగా లేకపోవడంతో రాత్రిపూట నీరుపారించడానికి వెళ్లిన రైతులు కరెంటు షాక్‌తో, విషపూరిత పురుగు కాట్లకు గురై చనిపోయేటోళ్లు. 24 గంటలు కరెంటుతో ఆ బాధలన్నీ పోయాయి. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంక నీరు పుష్కలంగా ఉంది. పంటలు మంచిగ పండుతున్నయి. గతంలో 3గంటలు, 7గంటలు ఇచ్చే కరెంటుతో చాలా ఇబ్బందులు ఉండేవి. మూడుగంటల కరెంటు అనే భావన ఎంతవరకు సమంజసమో చెప్పిన వారికే తెలియాలి. కాంగ్రెసోళ్లు మళ్లీ వస్తే పాత రోజులే వస్తయి.

**- నర్సింహసాగర్, యువరైతు**

## మూడు గంటల కరెంట్ సాలదు..



కాంగ్రెసోళ్లు చెబుతున్నట్లు మూడు గంటల కరెంట్ సేద్యానికి ఏమాత్రం సరిపోదు. మూడు గంటలు మోటర్ నడిస్తే ఎంత పైరు తడుస్తదో వారికేమి తెల్వు. పొలాలకొచ్చి మడులు తడిపితే సాగుకు ఎంత కరెంట్ అవసరమో తెలుస్తది. కాంగ్రెసోళ్లు మాట్లాడుతున్నది పిచ్చి మాటలే. రైతుల బోరు బావులకు 5హెచ్‌పీ మోటర్లే అవసరం తప్పా 10హెచ్‌పీ మోటర్లు కాదు. కాంగ్రెసోళ్లు మాట్లాడుతున్నది సూస్తుంటే వారికి వ్యవసాయం సాగుపై ఏం తెల్వదనేలాగా కనబడుతున్నది. రైతుల గురించి ఆలోచన చేసేది బీఆర్ఎస్ ప్రభుత్వమొక్కటే. సాగుకు కరెంట్ ఎంత అవసరమో గుర్తించే ప్రభుత్వం 24 గంటల కరెంట్‌ను ఇస్తుంది. కాంగ్రెసోళ్ల మాటలపై రైతులు కూడా ఒకసారి బాగా ఆలోచించి ఏ ప్రభుత్వం వస్తే బాగుంటుందో గుర్తించి ఓటు వేస్తే బాగుంటుంది.

**- వెంకట్‌రెడ్డి, రైతు..గట్టు**

## కాంగ్రెస్‌వి మోసపూరిత మాటలు..

కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రైతులను నట్టేట ముంచేందుకు పన్నాగాలు పన్నుతున్నరు. పేదలను కష్టాల్లోకి నెట్టడమే తప్పా ఎలాంటి మంచి చేసేది కాదు కాంగ్రెస్. 55ఏండ్లు పాలించి ఉమ్మడి పాలమూరును ఎడారిగా మార్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ రైతులకు 24గంటలు ఉచిత కరెంట్ ఇస్తున్నడు. ఇప్పుడిప్పుడే రైతులు బాగుపడుతున్నరు. మళ్లీ కాంగ్రెసోళ్లు వచ్చి మూడు గంటలు కరెంటు మస్తయితదని చెప్పడం చూస్తుంటే వాళ్లకు అధికారమిస్తే మళ్లీ రైతులు గోసపడక తప్పదు. రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వమే అండగా నిలుస్తున్నది. వారికే మా మద్దతు ఇస్తాం.

**- తిమ్మప్ప గౌడ్, రైతు, తాటికుంట, మల్దకల్ మండలం**



## నోటికాడి కూడు పోగొట్టుకుంటం..



కాంగ్రెసోళ్ల మాయమాటలు నమ్మితే నోటికాడి కూడు పోగొట్టుకుంటం. 3 గంటల కరెంటిస్తే పంటలు ఎలా పండించుకుంటాం. ఇది సాధ్యం అయ్యేపనేనా? వాళ్ల హయాంలో కరెంట్ ఎప్పుడు వచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెలియదు. అప్పట్లో త్రీ ఫేజ్ కరెంట్ వచ్చినపుడు మాత్రమే మోటర్లు ఆన్ చేసుకోవాల్సి వచ్చేది. రాత్రి వస్తదో పగలు వస్తదో కూడా తెలిసేది కాదు. తెలంగాణ వచ్చినంక ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నడు. నేను పదెకరాల పొలం బోరు కింద సాగు చేస్తున్నా. నాకు ఎప్పుడు వీలుంటే అప్పుడు వెళ్లి పొలానికి నీల్లు పెట్టుకుంటున్నా. మా గ్రామానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు పట్టణంలో పవర్ హాలిడే విధిస్తున్నారు. మాకు మాత్రం 24 గంటల కరెంటు అందుతోంది. కరెంటు పోతే ఆశ్చర్యం కాని.. ఉంటే ఆశ్చర్యం ఎందుకు? ఈ ఏడాది వర్షాలు లేక పంటలు ఎండిపోతాయెమో అని దిగులుచెందాం. కానీ 24 గంటల కరెంటుతో పంటలను కాపాడుకున్నాం. ఇలాంటి ముఖ్యమంత్రి దొరకడం మా అదృష్టం. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే నోటికాడికి వచ్చిన కూడును పోగొట్టుకున్నట్టే.

**- నాగశేషన్న, రైతు, గోకులపాడు, మానవపాడు మండలం**

## మూడుగంటలిస్తే బతికేదెట్టా..



కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడుగంటల కరెంటిస్తే సరిపోతుందని చెప్పడం కరెక్ట్ కాదు. అట్లా కరెంటిస్తే రైతులతోపాటు మాలాంటి మెకానిక్‌లకు కూడా ఇబ్బందులైతయ్. సీఎం కేసీఆర్ సార్ దయ వల్ల 24 గంటల విద్యుత్ వస్తుంది. రైతులు సంతోషంగా సాగు చేసుకుంటున్నరు. మేం కూడా సాఫీగా మా పని చేసుకుంటున్నం. మా చేతికింద కొంతమంది పని నేర్చుకోవడానికి వస్తున్నారు. కరెంట్ కంటిన్యూగా ఉండటం వల్ల వాళ్లు పనులు ఫాస్ట్‌గా నేర్చుకుంటున్నరు. దీంతో టైం కలిసొస్తుంది. నేను 20 ఏండ్లుగా మోటర్ల మెకానిక్ చేస్తున్నా. ఇంతవరకు ఒక్క రైతు వద్ద కూడా 10హెచ్‌పీ మోటర్ చూడలేదు. 5 హెచ్‌పీ మోటర్లే ఉంటయ్. కాంగ్రెసోళ్లు 10 హెచ్‌పీ అంటున్నరు. వారికి వ్యవసాయంపై అవగాహన లేదని అర్థమైతుంది.

**- వడ్ల రంగప్ప, మెకానిక్**

## మళ్లీ అంధకారంలోకి నెట్టేస్తరు..

రైతుల కరెంట్ కష్టా లు కాంగ్రెసోళ్లకి ఏమి తెల్వు. గతంల కరెంట్ కోసం నానా అవస్థలు పడ్డాం. తెలంగాణ వచ్చినంక మాకు కరెంట్ కష్టాలు లేవు. పొలాలకు నీరు పారించుకోవడానికి మూడుగంటల కరెంట్ సరిపోతదని రేవంత్‌రెడ్డి అంటున్నడు. అసలు వ్యవసాయం గురించి ఆయనకు ఏం తెల్వు. గత ప్రభుత్వాల కాలంలో రైతులు నీరు పారబెట్టడానికి పెండ్లాంపిల్లలను వదిలి రాత్రి వేళ పొలాల కాడ కరెంట్ కోసం ఎదురు చూస్తుంటిమి. అప్పట్ల శానామంది విషపురుగుల కాటుకు గురై సచ్చిపోయిండ్రు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నడు. బుద్ధి ఉన్నోడు ఎవడైనా ఈ మాట మాట్లాడ్తడా. రైతు 10హెచ్‌పీ మోటర్ ఎందుకు వాడ్తడు. వాళ్లకు వ్యవసాయం గురించి తెల్సే మాట్లాడుతున్నరా. 10హెచ్‌పీ మోటర్లు చిన్న, సన్నకారు రైతులు వేసుకోవడం సాధ్యమేనా? వాళ్లకు మంతి ఉండి మాట్లాడుతున్నరో.. మతిలేక మాట్లాడుతున్నరో అర్థమైతలేదు. రైతులకు మూడుగంటల కరెంటిస్తే ఎట్లైతది. ఆ మూడుగంటల్లో ఎన్ని ఎకరాలకు నీళ్లు పారించుకోవాలా. ఇటువంటి వారికి అధికారం ఇస్తే రైతులను తిరిగి అంధకారంలోకి నెట్టేస్తరు. రైతుల గురించి ఆలోచించని ఈ కాంగ్రెస్ మనకు అవసరమా? మనకు 24 గంటలు కరెంటిచ్చే వారికి మద్దతు తెలుపుదాం.



**- గోపినాథ్, బీరెల్లి, గద్వాల మండలం**